క్లుప్తంగా

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

• సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



సందేశాత్మక ప్రదర్శనలో చిన్నారులు

మంచిర్యాలఅర్బన్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. స్థానిక ఎథిక్ అకాడమీ స్కూల్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు నేర్చుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక, సందేశాత్మక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, డైరెక్టర్ చరణ్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు తోగరు సుధాకర్, లీగల్ అడ్వయిజర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

నేడు 'భూ భారతి'పై అవగాహన

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేసిన భూభారతి చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని రైతులు, ప్రజలు మధ్యాహ్నం 3గంటలకు సీతారాంపల్లి గ్రామంలోని రైతువేదిక వద్ద జరిగే ఈ సదస్సుకు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌తో పాటు ఇతర ముఖ్య అధికారులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

మంచిర్యాలఅర్బన్: స్థానిక చింతపండువాడలో ఆదివారం త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, 100రకాల గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాజు, రాకేష్ పాల్గొన్నారు.

వన్‌నేషన్, వన్ ఎలక్షన్‌పై అవగాహన

కోటపల్లి: మండలంలోని సిర్సా గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య ఆధ్వర్యంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై అవగాహన కల్పించారు. జమిలి ఎన్నికలు జరిగితే భారీ ఖర్చును తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పున్నంచంద్, నాయకులు రాజేష్, అశోక్, శిరీష, సమ్మయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగికి సన్మానం



సుధాలక్ష్మిని సన్మానిస్తున్న టీఎన్‌జీవో సభ్యులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతిగృహంలో సంక్షేమాధికారిగా విధులు నిర్వర్తిస్తూ గ్రేడ్-1 పదోన్నతి పొందిన సుధాలక్ష్మిని ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు మోసిన్‌అహ్మద్, టీఎన్‌జీవో యూనిట్ అధ్యక్షుడు గోపాల్, సంయుక్త కార్యదర్శి సునీత, శ్రీనివాస్, సరిత, రమేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

శ్రీరాంపూర్: జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా జెల్ల తిరుపతిని నియమించారు. ఈ మేరకు శనివారం మంచిర్యాలలో జరిగిన ఓ సమావేశంలో సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిగే శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా తిరుపతికి నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకం ఉంచి జిల్లాలో కీలక బాధ్యతలు అప్పగించినందుకు, నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తిరుపతి పేర్కొన్నారు.

ముగిసిన వారోత్సవాలు



విశ్రాంత ఉద్యోగిని సన్మానిస్తున్న సిబ్బంది

జన్నారం: స్థానిక ఫైర్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. దర్మారం క్రాస్ రోడ్డు వద్ద వ్యాపారస్తులకు కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం అగ్నిమాపక శాఖలో 32ఏళ్ల విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన బుచ్చయ్యను సన్మానించారు. ఎస్‌ఎఫ్‌వో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా చేతిపంపులు



చెన్నూర్‌రూరల్: లింగంపల్లిలో పనిచేయని చేతిపంపు



చెన్నూర్‌రూరల్: బుద్దారంలో..

కోటపల్లి/చెన్నూర్‌రూరల్: గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చేతిపంపులు మరమ్మతులకు నోచకోక నిరుపయోగంగా మారాయి. చెన్నూర్ మండలంలోని లింగంపల్లి, సంకారం, కమ్మరిపల్లి, బుద్దారం, కోటపల్లి మండలంలోని బోరంపల్లి, రాంపూర్ గ్రామాల్లో నెలలు గడుస్తున్నా చేతిపంపుల మరమ్మతులపై అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కోటపల్లి: బోరంపల్లిలో..



కోటపల్లి: రాంపూర్ బస్టాండ్‌లో..

అంగన్‌వాడీ భవనం.. ఆకర్షణీయం




రంగు రంగుల బొమ్మలతో బూర్గుపల్లిలోని అంగన్‌వాడీ భవనం

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలోని అంగన్‌వాడీ భవనం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. గోడలపై వేసిన పిల్లలు, గర్భిణుల ఫొటోలతో పాటు పిల్లల ఎదుగుదల, పండ్లు, కూరగాయల ఛాయచిత్రాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి.

తీరం.. ప్రమాదాలకు నిలయం

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి, ఎర్రాయిపేట సమీపంలోని గోదావరి తీరం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ గ్రామాల సమీపంలోని గోదావరి నదిలో ఇసుక తవ్వకాలు ఇష్టారీతిన పరిమితికి మించి తీయడంతో లోతు ఎక్కువగా ఉండి నీటితో నిండుకోవడంతో గోదావరి స్నానమాచరించేందుకు వచ్చిన వారికి లోతును గుర్తించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సంవత్సరంలోనే ఇప్పటికి ముగ్గురు మరణించినా, అధికారులు కనీస హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేయకపోవడం ఏంటని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లోతట్టు హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మరుగుదొడ్లు నిరుపయోగం..!



మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల బస్‌స్టేషన్ ఆవరణలో మున్సిపాలిటీ (కార్పొరేషన్)ఆధ్వర్యంలో మొదటి ద్వారం(గీత భవన్ వైపు) ప్రయాణికులు రాకపోకలు సాగించే షీ టాయిలెట్స్, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ఏర్పాటు చేసినప్పటి నుంచి మరుగుదొడ్ల ఎప్పుడు చూసినా తాళం తెరిచి లేకపోవటంతో నిరుపయోగంగా మారాయి. షీ టాయిలెట్స్‌లో కాయిన్స్ వేసే విషయంపై అవగాహన లేకపోవటంతో, ఎందుకు పనికిరాకుండా పోయాయి. దాదాపు రూ.10లక్షల వ్యయంతో చేపట్టిన మరుగుదొడ్లు వినియోగంలో లేకపోగా.. అటువైపు నుంచి వెళ్లే ప్రయాణికులు ముక్కు మూసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, షీ టాయిలెట్స్ ఇక్కడి నుంచి తొలగించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసి, వినియోగంలోకి తెస్తే ప్రజలకు ఉపయోగకరంగా మారనుంది.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



దండేపల్లి: మాదాపూర్‌లో శిలువ వెలిగింపులో క్రైస్తవ భక్తులు



లక్సెట్టిపేట: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



దొనబండ చర్చిలో ఈస్టర్ ప్రార్థనల్లో క్రైస్తవులు

దండేపల్లి: ఈస్టర్ వేడుకలను దండేపల్లి మండలంలో క్రైస్తవ భక్తులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు చనిపోయి తిరిగి లేచాడని చెబుతూ, గ్రామాల్లో క్యాండిల్స్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శిలువ వెలిగింపు కార్యక్రమాలతో పాటుగా, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు, సంఘ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని పలు చర్చీల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా పాస్టర్లు భక్తులకు సందేశాలు ఇచ్చారు.

లక్సెట్టిపేట: ఈస్టర్‌ను మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సీఎస్‌ఐ చర్చి వద్ద క్యాండిల్స్ వెలిగించి ఆరాధన శిల్వ గుట్టపై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్ డేవిడ్‌పాల్ ఏసుక్రీస్తు పునర్జన్మపై క్రైస్తవులకు సందేశాన్ని ఇచ్చారు. క్రైస్తవులు పెద్దమొత్తంగా హాజరై వేడుకలను సంతోషంగా జరుపుకున్నారు. ప్రముఖ న్యాయవాది సుమన్ చక్రవర్తి తన కూతురు శ్రేష్ఠ బర్త్‌డే సందర్భంగా భక్తులకు అల్పాహారాన్ని అందించారు.

'ఇందిరమ్మ' ఎంపిక పారదర్శకంగా జరిగేనా!

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై ముమ్మర కసరత్తు జరుగుతోంది. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసే పనిలో ప్రభుత్వ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నిమగ్నమయ్యారు. గడిచిన మూడు రోజుల నుంచి వార్డుల వారీగా అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేయడానికి యత్నాలు చేస్తున్నారు. లబ్ధిదారులను గుర్తించి తుది జాబితాను రూపొందించే పనిలో ఉండగా ప్రస్తుతం జరుగుతున్న కూర్పుపై పురప్రజల్లో క్రమంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీలో 34వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో ఏళ్ల తరబడి నుంచి ఇళ్ల మంజూరు కోసం పేదలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇళ్లు మంజూరైతే నిలువ నీడ కలుగుతుందని నిరీక్షిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మున్సిపల్ వ్యాప్తంగా 2,941దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ఆ లెక్కన ఒక్కో వార్డుకు గరిష్టంగా 26-29ఇళ్లను మంజూరు చేసే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఆ దరఖాస్తులన్నింటినీ వడపోయడానికి జరుగుతున్న కసరత్తులో కొందరు మాజీ ప్రజాప్రతినిధులు, మరి కొందరు నాయకులు అన్నీ తామై వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. లబ్ధిదారుల ఎంపిక ఎంతో పారదర్శంగా చేపట్టాల్సి ఉండగా ప్రతిపాదిత జాబితాలో కొందరు అనర్హుల పేర్లు ఉన్నట్లు చర్చించుకుంటున్నారు. వీరిలో ఆర్థికంగా స్థిరపడి, భవంతి కలిగిన ఓ మాజీ ప్రజాప్రతినిధి భార్య పేరు ఉన్నట్లు చెవులు కొరుక్కుంటున్నారు. ఆమె పేరును ఇంకా అధికారికంగా ఆమోదించనప్పటికీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ఏమాత్రం అర్హత లేని సదరు మహిళ పేరు చోటు చేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేస్తామని, అవకతవకలకు పాల్పడిన, అనర్హులకు కేటాయించిన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆ లబ్ధిదారుడి పేరును రద్దు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలుమార్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ప్రాధాన్యత ఇచ్చి పారదర్శకతను నిరూపించుకోవాలని పలువురు కోరుతున్నారు. లేనట్‌లైతే కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యేపై వ్యతిరేకత వచ్చే అవకాశాలు ఉంటాయని చర్చించుకుంటున్నారు. అక్రమాలు జరగకుండా, పేదలకు అన్యాయం జరగకుండా చూడాలని సూచిస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోసం 'సాక్షి' ఫోన్ చేయగా స్పందించలేదు.

కన్నయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

పాతమంచిర్యాల: ఈ నెల 4న ఆత్మహత్యకు పాల్పడిన వేమనపల్లి మండలం మంగెనపల్లికి చెందిన ఆదివాసీ నాయిని కన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవనంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కన్నయ్య మృతికి కారణాలపై అధికారులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అమాయక ఆదివాసీలు, దళితులపై పెత్తందారులు, భూస్వాముల దౌర్జన్యాలను అరికట్టాలన్నారు. ఆదివాసీలు, దళితులపై దౌర్జన్యాలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21, 22 తేదీల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకే రవి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాశ్, ఐద్వా జిల్లా కార్యదర్శి సామల ఉమారాణి, శ్రామిక మహిళా నాయకులు దాసరి రాజేశ్వరి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి డి.మోహన్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎర్మ పున్నం

క్షీరాభిషేకం

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లిలో సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఆదివారం సీ ఎం రేవంత్ రెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీ వంశీకృష్ణ సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికులకు రూ.140కోట్ల ప్రావిడెంట్ ఫండ్ విడుదల చేయించినందుకుగాను క్షీరాభిషేకం చేశారు.



క్షీరాభిషేకం చేస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులు

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



దండేపల్లి: మామిడిపల్లిలో పాదయాత్రలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నాయకులు

• డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

దండేపల్లి: భారతదేశ స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. దండేపల్లి మండలం మామిడిపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. గ్రామంలోని వీధుల గుండా పాదయాత్ర నిర్వహించారు. అనంతరం రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమాజంలో ప్రజాస్వామ్య విలువలను బీజేపీ కాలరాస్తూ, ప్రజల మధ్య విద్వేశాలను సృష్టిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మాలమహానాడు బెల్లంపల్లి కమిటీ ఎన్నిక

బెల్లంపల్లి: తెలంగాణ మాల మహానాడు బెల్లంపల్లి నియోజకవర్గ, పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. ఏసీసీ కమ్యూనిటీ హాల్లో ఆదివారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సమావేశానికి మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేశ్, ఇతర నాయకులు హాజరయ్యారు. అనంతరం కొత్త కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణ మాల మహానాడు బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా మాసు వెంకటస్వామిని ఎన్నుకోగా, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడిగా అంగూరి సుభాష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎలుక ఆకాష్, ఉపాధ్యక్షులుగా గీస రాజేశం, భూపల్లి శ్రీధర్, ముల్కల రాజేష్, కార్యదర్శులుగా పంబాల శ్రీనివాస్, బట్టల రమేష్, ప్రధాన కార్యదర్శిగా పైడిమల్ల చంద్రశేఖర్, కోశాధికారి గా పట్నం చక్రధర్‌లను ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా సుంకిత సమ్మయ్య, తొగరి సత్యనారాయణ, సాత్కు శ్రీనివాస్, ఆసాది మధు, బండెల మురళి, గుండా మాణిక్యం, సలహాదారులుగా పాముల రాజలింగు, సుకాశి కృష్ణ, నంది కొమురయ్య ను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేష్ ప్రకటించారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల గోపి, నాయకులు మోక్షనందం, అనసూర్య, సతీష్, రాంబాబు, కొండయ్య, చరణ్, శంకర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన కమిటీ సభ్యులతో నాయకులు

మల్టీపర్పస్ వర్కర్ల సంఘం అధ్యక్షుడిగా కృష్ణమూర్తి

భీమారం: మండలంలోని గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ల సంఘం అధ్యక్షుడిగా అనపురం కృష్ణమూర్తిగౌడ్ నియమితులయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నట్లు గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాడి మహేష్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కుర్సింగ చందు, ప్రధాన కార్యదర్శిగా కండె శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మల్టీపర్పస్ వర్కర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



పంట పొలానికి పక్షితోరణం!

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ సమీపంలో పంట పొలాల్లో గల విద్యుత్ స్తంభాల తీగలపై పక్షులు వాలాయి. కింద పచ్చని పంట పొలాలు, పైన విద్యుత్ తీగలపై వాలిన పక్షులను చూస్తుంటే, పంట పొలానికి పక్షి తోరణంలా కనిపించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

తాటిముంజ.. భళేమజా



నెన్నెల: సీజనల్‌గా లభించే తాటిముంజలు వేసవి తాపానికి ఉపశమనాన్ని అందించడంతో పాటు శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయి. నీటి శాతం ఎక్కువగా ఉండి తీయదనాన్ని ఇచ్చే తాటిముంజలను చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు చాలా మంది ఇష్టపడతారు. గ్రామాలతో పాటు పట్టణాల్లో ఈ ముంజలకు డిమాండ్ ఉంది. ఇవి శరీరాన్ని చల్లబరిచి ఎండ దెబ్బ నుంచి కాపాడుతాయని ప్రజలు వీటిని అధికంగా కొనుగోలు చేస్తుంటారు. గ్రామాల్లోంచి పట్టణాలకు తీసుకెళ్లి ఒక్క తిటిముంజ రూ.10చొప్పున అమ్ముతూ పలువురు గ్రామీణులు ఉపాధి పొందుతున్నారు.